వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

www.Voicetodaynews.com

https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

ఆదివారం, డిసెంబరు 14, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఏకీకృత న్యాయ విధానం అవసరం: సీజేఐ సూర్యకాంత్

జైసల్మీర్: దేశంలో న్యాయవ్యవస్థను మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా మార్చేందుకు ఏకీకృత న్యాయ విధానం అత్యంత అవసరమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో విధానాలు, ప్రమాణాలు ఒకేలా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాఖ్య విధానం కారణంగా ప్రతి హైకోర్టు తనకు అనుకూలమైన విధానాలు, సాంకేతిక వ్యవస్థలను అమలు చేస్తున్నందున న్యాయ పరిపాలనలో అసమానతలు కనిపిస్తున్నాయని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఈ విధమైన అవరోధాలను అధిగమించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు.





# మెస్సి మానియా



- హైదరాబాద్‌లో ఉత్సాహంగా మెస్సి పర్యటన
- ఉప్పల్‌లో వేలాదిగా తరలివచ్చిన అభిమానులు
- కోల్‌కతా ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన యంత్రాంగం
- ప్రశాంతంగా ముగిసిన ఎగ్జిబిషన్ మ్యాచ్
- ఈవెంట్‌ను నేరుగా పర్యవేక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి



ద గోట్ ఇండియా టూర్'లో భాగంగా ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి హైదరాబాద్‌కు రావడం రాష్ట్రవ్యాప్తంగా అభిమానుల్లో ఉత్సాహాన్ని ఉప్పొంగించింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్ ఫుట్‌బాల్ ప్రేమికులకు పండుగలా మారింది. వేల సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు మెస్సి ప్రతి కదలికను ఆసక్తిగా తిలకిస్తూ కేరింతలు కొట్టారు. అదే రోజు ఉదయం కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఘటనతో అక్కడ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేయడం, మెస్సి ముందుగానే వెళ్లిపోవడం చర్చనీయాంశమవ్వగా, హైదరాబాద్ పర్యటనపై ఉత్కంఠ నెలకొంది. అయితే ఆందోళనలకు తావులేకుండా ఉప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమం పూర్తిస్థాయిలో ప్రశాంతంగా ముగియడం విశేషం.

హైదరాబాద్ : సాయంత్రం వేళ నుంచే ఉప్పల్ స్టేడియం పరిసరాలు అభిమానులతో కిటకిటలాడాయి. చిన్నారుల నుంచి యువత వరకు 'మెస్సి%ౌ% మెస్సి%ౌ%' అంటూ నినాదాలు చేస్తూ స్టేడియాన్ని మార్మోగించారు. మ్యాచ్ ప్రారంభమైన తర్వాత మెస్సి ఇరు జట్లతో కలిసి కొద్దిసేపు ఆటలో పాల్గొని ప్రేక్షకులను అలరించారు. మైదానం అంతా తిరుగుతూ అభిమానులకు అభివాదం చేస్తూ, మధ్యమధ్యలో బంతులను కిక్ చేసి గ్యాలరీల వైపు పంపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి గోల్స్ చేయడంతో స్టేడియం ఒక్కసారిగా హర్షధ్వానాలతో మార్మోగింది. ఫుట్‌బాల్ జెర్సీలు ధరించిన అభిమానులు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలతో ఉప్పల్ ప్రాంతం సందడిగా మారింది. మెస్సిని ప్రత్యక్షంగా చూడాలనే ఉత్సాహంతో వచ్చిన వారిలో యువతులతో పాటు చిన్నారులు పెద్ద సంఖ్యలో కనిపించారు. ఇదే రోజు సాయంత్రం కోల్‌కతా నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సికి అధికారులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన ప్రయాణించే మార్గమంతా అభిమానులు వేచి ఉండి మెస్సి దర్శనంతో ఉల్లాసం వ్యక్తం చేశారు. జీ లాంజ్ వద్ద మెస్సి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకుని

(మిగతా 2వ పేజీలో)





## 'పాలమూరు' తొలి దశ డీపీఆర్‌కు అనుమతి ఇవ్వాలి: ఉత్తమ్ కుమార్

### మైనర్ ఇరిగేషన్ కోటాలోని 45 టీఎంసీల వినియోగానికి కేంద్ర ఆమోదం కోరుతూ లేఖ

- కృష్ణా ట్రిబ్యునల్-2 తీర్పు వేగవంతం చేయాలని జలశక్తి శాఖకు విజ్ఞప్తి
- ఏపీ పోలవరం-నల్లమల్లసాగర్‌కు అనుమతులు ఇవ్వొద్దని స్పష్టం




## నేడే రెండో దశ గ్రామ పంచాయతీ పోరు

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
- 3,911 సర్పంచ్ పదవులకు 12,782 మంది అభ్యర్థులు బరిలో
- 29,917 వార్డులకు 71,071 మంది అభ్యర్థుల మధ్య పోటీ
- 415 సర్పంచ్, 8,307 వార్డులు ఇప్పటికే ఏకగ్రీవం
- పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

## తెలంగాణలో పార్టీ పనితీరుపై రాహుల్‌గాంధీ సంతృప్తి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, పంచాయతీ ఫలితాలపై పీసీసీ చీఫ్ వివరాలు
- భవిష్యత్తులోనూ ఇదే స్థాయి పనితీరు కొనసాగించాలని సూచన
- శంషాబాద్ నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్ వరకు నేతలతో కలిసి ప్రయాణం
- సీఎం రేవంత్, మంత్రుల ఘన స్వాగతం
- పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై సానుకూల స్పందన



హైదరాబాద్/శంషాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పనితీరుపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రాహుల్‌కు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, తాజా ఎన్నికల ఫలితాలపై సమగ్రంగా వివరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం, అలాగే పంచాయతీ ఎన్నికల్లో

(మిగతా 2వ పేజీలో)



## కాంగ్రెస్ అక్రమాలపై ప్రజాతీర్పు: కేటీఆర్

- పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లభించిన విజయం ప్రజల మద్దతుకు నిదర్శనం
- బలప్రయోగం చేసినా కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తప్పలేదన్న కేటీఆర్
- సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనూ బీఆర్ఎస్ ప్రభావం
- జిల్లాల నుంచి వచ్చిన నూతన సర్పంచ్‌లతో నందినగర్ సందడి

హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ పోలీసులను అడ్డుపెట్టుకుని బలప్రయోగానికి దిగినా, ప్రలోభాలు, బెదిరింపులు చేసినా పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వెంటే నిలిచారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. డిసెంబర్ 11న జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో గెలుపొందడం కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి స్పష్టమైన నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే

ఆదివారం, డిసెంబరు 14, 2025

# మెస్సి మానియా










అభిమానులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. మధ్యాహ్నం నుంచే ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో మెస్సి పేరు మార్మోగుతూ, యువత భారీ బ్యానర్లు, జెర్సీలతో స్వాగతం పలికింది. సాయంత్రం నాలుగు గంటలకు స్టేడియం ముందు యువ క్రీడాకారులు ర్యాలీ నిర్వహించి 'ద గోట్ మెస్సి' అంటూ నినదించారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో మెస్సి హైదరాబాద్‌కు వస్తాడా? స్టేడియంలో కనిపిస్తాడా? అన్న సందేహాలు అభిమానులను వెంటాడాయి. అయితే శంషాబాద్‌లో విమానం ల్యాండ్ అయిన సమాచారం వెలువడగానే ఉత్కంఠ ఆనందంగా మారింది. రాత్రి 8.52 గంటలకు మెస్సి స్టేడియాన్ని వీడే వరకు ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ఈ పర్యటనకు ముందు నుంచే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, కోల్‌కతా ఘటన తర్వాత మరింత అప్రమత్తతతో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయం నుంచి వసతి ఏర్పాట్లు, స్టేడియం వరకు అన్ని వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మెస్సి సంచరించిన ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, రాహుల్ గాంధీ, క్రీడాకారులు, భద్రతా సిబ్బందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. మంత్రులను వేరే గ్యాలరీలో కూర్చోబెట్టారు. మ్యాచ్ ముగిసే వరకు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా కొనసాగాయి. 56 ఏళ్ల వయసులోనూ జెర్సీ ధరించి యువ ఆటగాళ్లతో పోటీపడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మైదానంలో పరుగులు తీయడం, గోల్స్ సాధించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ దృశ్యాలకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అయ్యాయి.

# నేడే రెండో దశ గ్రామ పంచాయతీ పోరు

**ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్**

**3,911 సర్పంచ్ పదవులకు 12,782 మంది అభ్యర్థులు బరిలో**

**29,917 వార్డులకు 71,071 మంది అభ్యర్థుల మధ్య పోటీ**

**415 సర్పంచ్, 8,307 వార్డులు ఇప్పటికే ఏకగ్రీవం**

**పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన**



హైదరాబాద్: తెలంగాణలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. ఈ విడతలో 3,911 సర్పంచ్ పదవుల కోసం 12,782 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, 29,917 వార్డు సభ్య స్థానాలకు 71,071 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇప్పటికే 415 సర్పంచ్ పదవులు, 8,307 వార్డులు ఏకగ్రీవమైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. రెండో విడతకు సంబంధించి ఐదు చోట్ల సర్పంచ్ స్థానాలతో పాటు 108 వార్డులకు నామినేషన్లు దాఖలు కాకపోవడంతో అక్కడ ఎన్నికలు రద్దయ్యాయి. అలాగే రెండు సర్పంచ్ స్థానాలు, 18 వార్డు ఎన్నికలపై కోర్టు స్టే ఉండటంతో ఆ ప్రాంతాల్లో పోలింగ్ జరగడం లేదు. పోలింగ్ అనంతరం అదే రోజు ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏదైనా కారణంతో వాయిదా పడితే మరుసటి రోజు ఆ ఎన్నికను చేపడతారు. పోలింగ్ పూర్తయ్యాక ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ వేసి మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. లెక్కింపు పూర్తయిన వెంటనే విజేతలను అధికారికంగా ప్రకటించనున్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండో దశ ఎన్నికల్లో ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థులు పోటీ పడుతుండగా, వార్డు సభ్య స్థానాలకు సగటున ఇద్దరు నుంచి ముగ్గురు బరిలో ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులు కేటాయించినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా ఇప్పటివరకు రూ.2.02 కోట్ల నగదు, రూ.3.46 కోట్ల విలువైన మద్యం, రూ.2.28 కోట్ల విలువైన డ్రగ్స్ సహా మొత్తం రూ.8.59 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈసీ వెల్లడించింది. ఈ మేరకు 3,675 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ముందుజాగ్రత్తగా 33,262 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపింది.

# 'పాలమూరు' తొలి దశ డీపీఆర్‌కు అనుమతి ఇవ్వాలి: ఉత్తమ్‌కుమార్

**మైనర్ ఇరిగేషన్ కోటాలోని 45 టీఎంసీల వినియోగానికి కేంద్ర ఆమోదం కోరుతూ లేఖ**

**కృష్ణా ట్రిబ్యునల్-2 తీర్పు వేగవంతం చేయాలని జలశక్తి శాఖకు విజ్ఞప్తి**

**ఏపీ పోలవరం-నల్లమల్లసాగర్‌కు అనుమతులు ఇవ్వొద్దని స్పష్టం**

**ఏఐబీపీ కింద తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్**

**ఆల్మట్టి ఎత్తు పెంపు దిగువ రాష్ట్రాలకు నష్టం: ఉత్తమ్ ఆందోళన**



హైదరాబాద్/న్యూఢిల్లీ: పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టు తొలి దశ కింద మైనర్ ఇరిగేషన్ కోటాలో మిగిలిన 45 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు సమర్పించిన సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు వెంటనే అనుమతి ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి శాఖను కోరారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావుకు లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్%-%2 నుంచి అవసరమైన అనుమతులు వచ్చిన తర్వాతే రెండో దశ పనులు చేపడతామని లేఖలో స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న అనుమతులను సత్వరమే మంజూరు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ లేఖను నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఢిల్లీలో కాంతారావును కలిసి అందజేశారు. పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌కు సంబంధించి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని వివిధ డైరెక్టరేట్ల నుంచి ఫాస్ట్‌ట్రాక్ విధానంలో అనుమతులు ఇప్పించాలని ఉత్తమ్ కోరారు. మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలతో పాటు పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల మళ్లింపుతో లభించిన మరో 45 టీఎంసీలు కలిపి మొత్తం 90 టీఎంసీలను పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించినట్లు మంత్రి వివరించారు. సీడబ్ల్యూసీ లేవనెత్తిన సందేహాలను మే 6న నాగర్‌కర్నూల్ సీఈ నివృత్తి చేసినప్పటికీ ఇప్పటివరకు అనుమతులు రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు డీపీఆర్‌కు సంబంధించి సీడబ్ల్యూసీలోని ఇరిగేషన్ ప్లానింగ్ డైరెక్టరేట్ నుంచి రావాల్సిన అనుమతులను కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఏపీ%-%తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్%-%2 త్వరగా తీర్పు వెలువరించేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని సూచించారు. తీర్పు వస్తే నిర్మాణ దశలో ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు వేగంగా పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఏపీ ప్రతిపాదించిన పోలవరం%-%నల్లమల్లసాగర్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని సీడబ్ల్యూసీతో పాటు ఇతర చట్టబద్ధ సంస్థలకు కేంద్రం ఆదేశాలు ఇవ్వాలని ఉత్తమ్ కోరారు. మరోవైపు ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపును అడ్డుకోవాలని కేంద్రాన్ని కోరుతూ, డ్యామ్ ఎత్తు పెరిగితే దిగువన ఉన్న తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అక్రమాలపై ప్రజాతీర్పు: కేటీఆర్

ఎన్ని అక్రమాలకు పాల్పడ్డా ప్రజలు వాటిని తిరస్కరించారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కు వినియోగించి తమ నిర్ణయాన్ని వెల్లడించారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తమ పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థులు సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ప్రజాతీర్పేనని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్‌లు శనివారం నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి మర్యాదపూర్వకంగా వచ్చి కలిశారు. నల్లగొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి వందలాదిగా సర్పంచ్‌లు తరలిరావడంతో నందినగర్ నివాసం సందడిగా మారింది. మరో వారం నుంచి పది రోజుల పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చే నూతన సర్పంచ్‌లను కేటీఆర్ కలుస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా బీఆర్ఎస్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లుగా గెలవడం విశేషమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఆయన అన్నారు. కొడంగల్‌లో గెలుపొందిన సర్పంచ్‌లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఇదే రోజు హైదరాబాద్ మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కేటీఆర్ లంచ్ చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో సాగిన ఈ భేటీలో ఇరువురు నేతలు సమకాలీన రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి కొనసాగుతుందన్న స్పష్టతను అఖిలేశ్ యాదవ్ వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం కేటీఆర్, అఖిలేశ్ యాదవ్‌తో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి వెళ్లారు.

# కోల్‌కతాలో మెస్సి ఈవెంట్ రసాభాస..

**గంగూలీ మాట వినకుండానే వెళ్లిపోయిన మెస్సి**

**కోల్‌కతాలో మెస్సి కార్యక్రమం తీవ్ర గందరగోళం**

**భద్రతా కారణాలతో మధ్యలోనే వెళ్లిపోయిన మెస్సి**

**సౌరవ్ గంగూలీ విజ్ఞప్తిని తిరస్కరించిన మెస్సి బృందం**

**ప్రధాన నిర్వాహకుడు శతద్రు దత్తా అరెస్ట్**

**టికెట్ డబ్బులు వాపస్ ఇస్తానని చెప్పి పోస్ట్ డిలీట్**



ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులకు తీవ్ర నిరాశ ఎదురైంది. కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో శనివారం జరిగిన 'గోట్ టూర్' కార్యక్రమం తీవ్ర గందరగోళానికి, రసాభాసకు దారితీసింది. భద్రతా లోపం తలెత్తే సూచనలు కనిపించడంతో మెస్సి కార్యక్రమం మధ్యలోనే నిష్క్రమించారు. అనంతరం ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న ప్రధాన నిర్వాహకుడు శతద్రు దత్తాను పోలీసులు విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. అధిక ధరలకు టికెట్లు కొనుగోలు చేసినప్పటికీ, మైదానంలో ఉన్న జనం అడ్డుగా ఉండటంతో తమకు మెస్సి కనిపించడం లేదంటూ ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపటికే గ్యాలరీలో అశాంతి చెలరేగి, స్టేడియంలోకి బాటిళ్లు విసరడం మొదలుపెట్టారు. పరిస్థితి చేయి దాటిపోతుందని గమనించిన మెస్సి బృందం వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో భారత మాజీ క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, నిర్వాహకుడు శతద్రు దత్తా మరికొంత సేపు ఉండాలని మెస్సిని కోరారు. అయితే, భద్రతాపరమైన అంశాలలో రాజీపడేది లేదని స్పష్టం చేసిన మెస్సి బృందం వారి విజ్ఞప్తిని సున్నితంగా తిరస్కరించింది. తన సహచరులు రోడ్రిగో డి పాల్, లూయిస్ సువారెజ్‌లతో కలిసి మెస్సి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు మెస్సి మైదానంలో గడిపింది కేవలం 20 నిమిషాలే. ఆ సమయంలో కూడా ఆయన చుట్టూ మంత్రులు, వీఐపీలు, సిబ్బంది ఉండటంతో అభిమానులు ఆయన్ను సరిగా చూడలేకపోయారు. ఈ ఘటన తర్వాత, టికెట్ డబ్బులు వాపసు ఇస్తానని శతద్రు దత్తా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి, కాసేపటికే దాన్ని తొలగించారు. అనంతరం హైదరాబాద్ వెళ్లేందుకు కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# తెలంగాణలో పార్టీ పనితీరుపై రాహుల్‌గాంధీ సంతృప్తి

పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో గెలుపొందిన అంశాలను పీసీసీ చీఫ్ రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రాహుల్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే విధంగా ప్రభుత్వం, పార్టీ కలిసి పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. ఇదే పనితీరు కొనసాగితే రాష్ట్రంలో పార్టీ స్థానం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్‌గాంధీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథ్, సచిన్ సావంత్‌తో పాటు పలువురు మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శంషాబాద్ నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్ వరకు రాహుల్‌తో కలిసి సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ ఒకే కారులో ప్రయాణించారు. పార్టీ నేతలు, మంత్రులతో జరిగిన అనౌపచారిక చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలు, రాబోయే ఎన్నికల వ్యూహాలపై కూడా స్వల్పంగా చర్చ జరిగినట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పార్టీ అధిష్ఠానం సానుకూలంగా ఉందన్న సంకేతంగా రాహుల్ వ్యాఖ్యలను పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న రీసోనెన్స్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

## అనధికార పరీక్షను రద్దు చేసిన విద్యాశాఖ అధికారులు




నాచారం (వాయిస్ టుడే):విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా రేపు డిసెంబర్ 14న జరగనున్న మెగా రీసో ఫాస్ట్(టాలెంట్ టెస్ట్) ను రద్దు చేయాలని, రీసోనెన్స్ విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విద్యాశాఖను డిమాండ్ చేయగా మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా విద్యాశాకాధికారులు(డీఈఓ) స్పందించి విద్యాశాఖ గుర్తింపు లేని రీసోనెన్స్ పాఠశాలల్లో ఎటువంటి టెస్టులు నిర్వహించరాదని ఆదేశాలు ఇచ్చారు. మెగా రీసో ఫాస్ట్ పేరిట విద్యార్థుల నుండి వసూళ్లు చేసిన ఫీజును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాచారం లో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం సెక్షన్ 13 ప్రకారం విద్యార్థులకు ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులను విద్యా వ్యాపారంగా నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నా, కేవలం వ్యాపారమే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని ధ్వజ మెత్తారు. 5 నుండి 10 వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని, అయితే ఈ పరీక్ష రాయడానికి 300 రూపాయలను ఎంట్రన్స్ ఫీజు రూపంలో వసూళ్లు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. డిసెంబర్ 14వ తేదీన ఈ పరీక్షను రీసోనెన్స్ జూనియర్ కళాశాలల్లో మరియు గుర్తింపు లేని రీసోనెన్స్ పాఠశాలల్లో నిర్వహించనున్నారని, ఒకవేళ ఈ పరీక్షను నిర్వహిస్తే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. అదేవిధంగా రీసోనెన్స్ విద్యాసంస్థకు నిజంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉచితంగా నిర్వహించొచ్చుకదా అని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలని రీసోనెన్స్ లాంటి మోసపూరిత విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రీసోనెన్స్ టాలెంట్ టెస్ట్ కు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ. లక్ష్మీ నారాయణ ప్రమోట్ చేయడం సిగ్గుచేటని, మరి ఈ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉచితంగా అభ్యసించడానికి లక్ష్మీ నారాయణ హామీ ఇవ్వగలడా అని వారు డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యా సంస్థలకు లక్ష్మీ నారాయణ వత్తాసు పలకడం అప్రజాస్వామికమన్నారు. మెగా రీసో ఫాస్ట్ టెస్ట్ పేరిట వసూళ్లు చేసిన ఫీజును విద్యార్థులకు తిరిగి చెల్లించాలని లేకుంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలక్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గిరి బాబు, నేతలు అనీల్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ పలు ఆహ్వానాలను అందజేసిన నియోజకవర్గం నాయకులు, ప్రజలు



కుత్బుల్లాపూర్ డిసెంబర్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్,కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ నియోజకవర్గం పార్టీ నాయకులు, ప్రజలు పలు ఆహ్వానాలను అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డ్రోన్ ద్వారా సూచనలు చేసిన సిపి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ క్రికెట్ స్టేడియం నుండి బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు రాచకొండ సిపి సుధీర్ బాబు డ్రోన్ ల ద్వారా పర్యవేక్షిస్తూ వారికి కమాండ్ %ఢ% కంట్రోల్ సెంటర్ నుండి మొత్తం బందోబస్త్‌ను వ్యక్తిగతంగా సలహాలు ఇచ్చారు.లైవ్ డ్రోన్ నిఘా ద్వారా ఫీల్డ్ అధికారులకు రియల్-టైమ్ దిశానిర్దేశాలను అందిస్తున్నారు. దుర్బల ప్రదేశాలు రద్దీగా ఉండే సమావేశ ప్రదేశాలను స్కాన్ చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించి భద్రత ఏర్పాటును లైవ్ లో పర్యవేక్షిస్తున్నారు.లైవ్ ఏరియల్ ఇన్‌పుట్‌ల ఆధారంగా, సమర్థవంతమైన జనసమూహ నిర్వహణ కోసం మరియు వారి గమ్యస్థానాల వైపు ప్రజల సజావుగా కదలికను సులభతరం చేయడానికి సిపి ఆన్-గ్రౌండ్ అధికారులకు తక్షణ సూచనలను జారీ చేస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేయబడిన అడ్వాన్స్‌డ్ టెక్నలాజికల్ ఫ్యూజన్ సెంటర్, జనసమూహ కదలికలు, ప్రవేశ మరియు నిష్క్రమణ పాయింట్లు మరియు సున్నితమైన ప్రదేశాలను పర్యవేక్షించడానికి 24 గంటలూ పనిచేస్తోందనీ సిపి తెలిపారు. డ్రోన్ ఫీడ్‌లతో సహా మొత్తం 375 నిఘా కెమెరాలు వ్యవస్థలో అనుసంధానం చేయబడ్డాయి. అధునాతన పర్యవేక్షణ భాగాలను ఉపయోగించి లైవ్ ఫీడ్‌లను నిరంతరం విశ్లేషిస్తు ప్రభావవంతమైన బందోబస్త్ నిర్వహణ కోసం సంబంధిత రంగానికి ఫీల్డ్ అధికారులకు కార్యాచరణ నిఘా నేరుగా ప్రసారం చేయబడుతోందని ఆయన చెప్పారు.




## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

సికింద్రాబాద్, డిసెంబర్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): రోటరీ క్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్, మా ఈ ఎన్ టీ, కేర్ హాస్పిటల్ వారి సహకారంతో ఒయాసిస్ పాఠశాలలో రెండు రోజుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో చెవి ముక్కు గొంతు, కన్ను, పంటి పరీక్షలు నిర్వహించారు. 1550 విద్యార్థి, విద్యార్థినులు, స్కూల్ సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ ఉచిత శిబిరాన్ని పాఠశాలలో నిర్వహించినందుకు ప్రిన్సిపాల్, సిబ్బంది రోటరీ క్లబ్ చేంజ్ మేకర్స్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు యోగేశ్వర్ రెడ్డి మా ఈ ఎన్ టి, కేర్ హాస్పిటల్ వారికి సిబ్బందికి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.




## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం

సికింద్రాబాద్, డిసెంబర్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం నాచారం లోని మినీ ట్రక్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధ్యక్షుడు ఉంగరాల వెంకట నరసింహారెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్, వై. సుదర్శన బాబు, రీజినల్ కలెక్షన్ హెడ్ ఎన్. విమల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కస్టమర్లు, కంపెనీ ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన బాబు మాట్లాడుతూ, వినియోగదారుల కోసం కంపెనీ మెగా స్వాగత్ ఉత్సవాన్ని నిర్వహించిందని, కంపెనీ అందించే ఆర్థిక సౌకర్యాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాహన డీలర్లు పాల్గొన్నారు.



## బదిర మహిళల హక్కుల సాధికారతపై జాతీయ సదస్సు

నాచారం (వాయిస్ టుడే): రాజ్యాంగపర హక్కులు హక్కులతోనే బదిర మహిళా సాధికారత సాధించగలమని తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు.ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్ ( ఏఐఎఫ్డి ) మహిళా విభాగం అధ్యక్షురాలు ఉజ్జని జానకి సభా అధ్యక్షతన మొదటి బదిర మహిళల జాతీయ సదస్సు %-% 2025 సికింద్రాబాద్‌లోని సెంట్ ఆన్స్, తార్నాక లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీపుల్ విత్ హియరింగ్ ఇంపైర్డ్ నెట్‌వర్క్ ( పి హెచ్ ఐ ఎన్ ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో భారతదేశంలోని 18 రాష్ట్రాల నుంచి 150 మందికి పైగా బదిర మహిళలు పాల్గొన్నారు. మాట వినికిడి లోపం గల మహిళల హక్కులు, నాయకత్వం, విద్య, ఉపాధి, భద్రత, అందుబాటు (ఆక్సిస్సిబిలిటీ) వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి."బదిర మహిళల హక్కుల సాధికారత" అనే ప్రధాన అంశంతో ఈ జాతీయ సదస్సు నిర్వహించారు.

సదస్సును ప్రారంభించిన తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, బదిర మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు.సంకేత భాష అందుబాటును పెంచాలని సూచించారు. ఏఐఫ్డి అధ్యక్షులు సునీల్ సహస్రబుద్ధే మాట్లాడుతూ బదిర మహిళల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం చారిత్రాత్మక అడుగని తెలిపరు వారి నాయకత్వాన్ని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. ఏఐఎఫ్డి ప్రధాన కార్యదర్శి రోషన్ కుమార్ మాట్లాడుతూ, బధిర మహిళల హక్కుల కోసం జాతీయ స్థాయిలో నిరంతర పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఎంపీడీవో అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు దివ్యాంగుల హక్కుల సాధనలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్ఏడి ఉపాధ్యక్షులు గీతా శర్మ చెవిటి మహిళలు స్వయం ఆధారితంగా ఎదగాల్సిన అవసరాన్ని వివరించారు.బదిర మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సవాళ్లపై వక్తలు దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ ఆకృతి డైరెక్టర్ బాబు, పిన్ ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణారెడ్డి, శోభ తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్, నిర్మాణ పనులను పరిశీలించిన ఉప్పల్ కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ లోని ఓల్డ్ విలేజ్(భరత్ నగర్)లో 60 లక్షల తో సీసీ రోడ్డు ,పనులు శుక్రవారం పరిశీలించారు . ఇటీవలనే కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులను చేయిస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ,ఏఈ రాజ్ కుమార్ తో కలిసి ఓల్డ్ విలేజ్ భరత్ నగర్ లోని మాల్ మైసమ్మ ఆలయం ఏరియాలో జరుగుతున్న పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఉప్పల్ ఓల్డ్ విలేజ్ భారత్ నగర్ లో పెండింగ్‌లో ఉన్న ఒపెన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోగుల నర్సింహ రెడ్డి,పోగుల సత్తి రెడ్డి,మహంకాళి రాజు,సల్లా ప్రభాకర్ రెడ్డి,ఈగ శ్రీధర్,రంగుల శేఖర్ ముదిరాజ్,కాయల సుధాకర్,కాయల యాదయ్య,తైసీన్,బచ్చ రామ్ తోటరాంచందర్, గణేష్, శ్రీకాంత్,శ్రీధర్ రెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.




## 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు విజయం

### కర్ణాటకపై ఇన్‌లైన్ హాకీ జూనియర్ బాలుర జట్టు ఘన విజయం

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 13(వాయిస్ టుడే) : విశాఖపట్నంలో జరుగుతున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఇన్‌లైన్ హాకీ జూనియర్ బాలుర జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జూనియర్ బాలుర జట్టు, కర్ణాటక జూనియర్ బాలుర జట్టును 4%-%1 గోల్స్ తేడాతో ఓడించి ఘన విజయం సాధించింది. తెలంగాణ జట్టు తరఫున సుశాంత్ దేశాయ్ రెండు గోల్స్ సాధించగా, ప్రణయ్ ఒక గోల్, శరత్ ఒక గోల్ నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అలాగే రోహిత్, యానాల హర్షిత్ రెడ్డి, హరీష్, నీరజ్, ఆధిపత్, చంద్రహాస్ తదితర ఆటగాళ్లు సమన్వయంతో ఆటను ప్రదర్శించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో తెలంగాణ జట్టు ఛాంపియన్‌షిప్‌లో తమ బలాన్ని మరోసారి చాటుకుంది.

## మహాదేవపురంలో సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ రావుల శేషగిరి



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రావుల శేషగిరి గాజులరామారం డివిజన్ పరిధిలో మహాదేవపురం లో సమస్యలపై పాదయాత్ర చేసిన బీజేపీ నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఈ కార్యక్రమంలో వాసు , జగదీశ్వర్ రెడ్డి, మురళీకృష్ణ, ఉమామహేశ్వర్ , వెంకట్ , శంకర్ సుభాష్ చంద్రబోస్, ఆనంద్ ,శ్రీనివాస్ తదితర నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరికలు

## కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్



కూకట్ పల్లి, డిసెంబర్ 13(వాయిస్ టుడే) : కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ తో భరత్ నగర్ కాలనీ నుండి వివిధ మరియు స్వచ్ఛందంగా కొందరు ఏ బ్లాక్ అద్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యములో బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఇదే పద్యంలో డివిజన్ పరిధిలోని కొంతమంది యువకులు జి. బిక్షపతి గౌడ్, నరేందర్ బాబు, సత్య నారాయణ, మధు, వెంకటేష్, తదితరులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రజా పాలన ఎంతో బాగుందని, వారు ప్రవేశ పెట్టిన పథకాలు చాలా బాగున్నాయని కొనియాడారు. అలాగే కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పిలిస్తే పలికే నాయకులు గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భరత్ నగర్ కాలనీ లో శ్రీ హరి హార క్షేత్ర దేవస్థానంలో కూడా చాలా అభివృద్ధి పనులు పూర్తి చేసిన సంగతి మర్చిపోలినిదని వారు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కాలని సంక్షేమ కోరకు మరి కొంత పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అద్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్మయ్య, డివిజన్ అద్యక్షులు కె. రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూరి రాము, భరత్ నగర్ కాలనీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మామిల్ల వెంకటేశ్ యాదవ్, జనరల్ సెక్రెటరీ నరేష్ కుమార్, బి ర్ నాగేశ్వర్ రావు, కెఎస్ఎన్ మూర్తి, వెంకట పతి రాజు, నవాబ్ సాబ్ సంతోస్కుమార్ శ్రీనివాస్, ఎన్ ఎస్ యు ఐ కిట్టు, లు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం - పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టాం



## ఓబీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంట్‌లో పోరాటం

### ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ఘన సత్కారం

హైదరాబాద్, డిసెంబర్ 13, 2025: అన్ని రంగాల్లో వెనుకబడిన వర్గాల (ఓబీసీలు) రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని కోరుతూ పార్లమెంట్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ నేత ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు పార్టీ నేతలు ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, ఎల్.రమణ, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, వీ.శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు మొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్ కండువా కప్పి ప్రత్యేకంగా సన్మానించారు. ఓబీసీల హక్కుల సాధనకు పార్లమెంట్ వేదికగా బీఆర్ఎస్ చేపట్టిన ఈ చర్యకు నేతలు మద్దతు ప్రకటిస్తూ, బీసీలకు సామాజిక న్యాయం సాధించాలనే లక్ష్యంతో పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బమ్మెర రాంమూర్తి సహా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండో విడత పంచాయతీ ఎన్నికలు.. ఉప్పల్‌లో ప్రయాణికుల రద్దీ

హైదరాబాద్: తెలంగాణలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భాగ్యనగరంలో ఉంటున్న ప్రజలు తమ స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ క్రమంలోనే నగరంలోని జూబ్లీ బస్ స్టేషన్, ఉప్పల్ బస్ స్టాప్ వద్ద రద్దీ నెలకొంది. ఊళ్లకు వెళ్లే వారితో ఉప్పల్ ప్రాంతమంతా సందడిగా మారింది. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవాలు కాకుండా 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది.

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**కాంగ్రెస్, బీజేపీ వైఖరి స్పష్టం చేయాలి – బీసీల ఆగ్రహం స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపించింది**

**కేసీఆర్ హయాంలోనే బీసీలకు గౌరవం, న్యాయం : బీఆర్ఎస్ నేతల ధ్వజమెత్తింపు**



హైదరాబాద్, డిసెంబర్ 13, 2025: బీఆర్ఎస్ మొదటి నుంచే బహుజనుల పక్షాన నిలిచిన పార్టీ అని, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కలిపి మొత్తం జనాభాలో 90 శాతానికి పైగా ఉన్నారని రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధించడమే కాకుండా పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, బీసీలకు సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, వీ.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, ఎల్.రమణ తదితర ప్రముఖులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కాలయాపన చేస్తూ మోసం చేస్తోందని మండిపడ్డారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలంటూ రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టినట్లు ఎంపీ వద్దిరాజు వెల్లడించారు. ఈ బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ సహా అన్ని పార్టీల మద్దతు కోరతామని తెలిపారు. ఎన్నికల ముందు, ఆ తర్వాత కాంగ్రెస్ నేతలు చేసిన హామీలను పార్లమెంట్ వేదికగా ఎండగడతామని హెచ్చరించారు.

బీసీలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో కలత చెందిన సాయి ఈశ్వర చారి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఇది కాంగ్రెస్ నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కులగణన పూర్తిగా అవాస్తవమైందని, బీసీల జనాభాను సుమారు 45 లక్షలు తక్కువగా చూపించారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు ఎలా అమలయ్యాయో తెలంగాణ ప్రభుత్వం తెలుసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాలు కాంగ్రెస్ పాలనపై ప్రజల అసంతృప్తిని స్పష్టం చేశాయని, రానున్న దశల ఎన్నికల్లోనూ బీసీలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డికి మెస్సీపై ఉన్న ఆసక్తి బీసీలపై లేదని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కూడా అడగని పరిస్థితి శోచనీయమన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని ఆరోపించారు.

ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. బీసీల కోసం పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టిన బీఆర్ఎస్ నిర్ణయాన్ని గుర్తుచేశారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో రెండు కోట్లకు పైగా బీసీలు ఉన్నారని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తర్వాత జరిగిన పరిణామాలు బీసీలకు అన్యాయంగా మారాయని విమర్శించారు. బీసీ హక్కుల కోసం సుప్రీంకోర్టులో బలమైన న్యాయపోరాటం చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశంలో కొత్త చట్టాలు వస్తున్నప్పటికీ బీసీల విషయంలో వివక్ష ఎందుకని ప్రశ్నించారు. తమిళనాడులో బీసీలు రిజర్వేషన్లు సాధించినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని నిలదీశారు. ఎంపీ వద్దిరాజు ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లు అన్ని పార్టీలకు చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్, పార్టీ నాయకుడు బొమ్మెర రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.





# అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన వేములవాడ అయ్యప్ప స్వామి దేవాలయం

వేములవాడ / రాజన్న సిరిసిల్ల జిల్లా ( వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన ఆరట్టు మహోత్సవం భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా అత్యంత ఘనంగా సాగింది. “స్వామియే శరణమయ్యప్ప” అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం అంతటా భక్తి పరిమళం వ్యాపించగా, తెల్లవారుజామునుంచి రాత్రివరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షులు కొండ దేవయ్య గురు స్వామి ఆధ్వర్యంలో ఆరట్టు మహోత్సవానికి విశేష ఏర్పాట్లు చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గణపతి హోమం, వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు జరగ్గా, స్వామివారి దర్శనంతో భక్తులు పరవశించారు.







ఉదయం ఆలయంలో గజ గౌరీ వ్రతం ఘనంగా నిర్వహించగా, ఆలయం ముందు అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం, అభిషేకములు నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్రతాలు ఆచరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మధ్యాహ్నం అయ్యప్ప స్వామివారికి భిక్ష కార్యక్రమం నిర్వహించడంతో పాటు, భక్తుల కోసం విస్తృతంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు అన్నదానం స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

### సాయంత్రం సామూహిక మహా పడిపూజ

ఆరట్టు మహోత్సవంలో భాగంగా సాయంత్రం వేళ నిర్వహించిన మహా సామూహిక పడిపూజ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది అయ్యప్ప భక్తులు ఒకే చోట సమవేశమై పాడిపూజలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు అశేష జన సంద్రోహంతో నిండిపోయాయి. ఒకే స్వరంతో అయ్యప్ప నామస్మరణ, భజనలు, శరణు ఘోషలతో వాతావరణమంతా భక్తి తరంగాలతో కంపించింది. ఈ మహా పడిపూజ భక్తుల హృదయాల్లో అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఈ ఆరట్టు మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు చల్మెడ లక్ష్మీనర్సింహరావు, ప్రతాప రామకృష్ణ, న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, ఏనుగు మనోహర్ రెడ్డి, పొలాస నరేంధర్, రామతీర్థపు రాజు, బింగి మహేష్, కానికరపు రాకేష్, కుమ్మరి శంకర్, చంద్రగిరి శ్రీనివాసు, కట్కూరి శ్రీనివాస్, నామాల పోశెట్టి, కోయినేని బాలయ్య, చిలుక రమేష్, పుల్కం రాజు, నిమ్మశెట్టీ విజయ్, మారం కుమార్, నీలం శేఖర్, సిరిగిరి చందు, నరాల శేఖర్, గొలి మహేష్, బత్తుల మహేందర్ యాదవ్ తదితర ప్రముఖులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఆలయ ప్రధాన అర్చకులు యశ్వంత్, ఆలయ గురుస్వామి బొంగొని అంజయ్య గురు స్వామి పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు కొండ కనకయ్య, నరసయ్య, కొండ లక్ష్మణ్, కొండ కృష్ణలతో పాటు పలువురు అయ్యప్ప స్వామి భక్తులు సేవలందించారు. ఆలయ ఆస్థాన గాయకులు మిద్దె పరశురామ్, గోపు మల్లేశం ఆలపించిన అయ్యప్ప భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొత్తంగా ఆరట్టు మహోత్సవం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పూజలు, వ్రతాలు, అన్నదానం, మహా సామూహిక పాడిపూజ కార్యక్రమాలు భక్తుల్లో అపూర్వ ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.







# రెండో విడత పంచాయతీ పోరుకు బరిసిద్ధం

## నేడు ఓటింగ్ - మధ్యాహ్నామే కౌంటింగ్

చిగురుమామిడి, డిసెంబర్ 13 (వాయిస్ టుడే): పంచాయతీ రాజ్ వ్యవస్థలో కీలకమైన సర్పంచ్ ఎన్నికల సంగ్రామం తుది దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని 17 గ్రామాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. ప్రచార వేడి శుక్రవారం సాయంత్రంతో ముగియడంతో ఒకప్పటి హోరాహోరీ వాతావరణం నెలకొన్న గ్రామాలు ఒక్కసారిగా నిశ్శబ్దంతో కమ్ముకున్నాయి. అభ్యర్థుల్లో అయితే టెన్షన్ పీక్ స్థాయికి చేరుకుంది. ప్రచారంలో మంచి స్పందన ఉన్నా, లెక్కించేంత వరకూ ఓటర్లు ఎటు మొగ్గు చూపారన్న అనుమానం అభ్యర్థులను ఉడికిస్తోంది.




**ఒకే రోజు పోలింగ్ – కౌంటింగ్ – ప్రమాణ స్వీకారం**

రెండవ విడతలో ప్రత్యేకత ఏమిటంటే, ఒకే రోజున పోలింగ్, కౌంటింగ్, పాలకవర్గ ప్రమాణ స్వీకారం పూర్తిచేయనున్నారు. సాయంత్రానికి గ్రామాల భవిష్యత్తు రూపు రేఖలు స్పష్టమవనున్నాయి. సర్పంచ్‌తో పాటు ఓట్ల లెక్కింపు అనంతరం వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించనున్నారు.

**ఎన్నికల సామాగ్రి చేరిక – భద్రత కట్టుదిట్టం**

17 గ్రామాల్లో నిర్వహించనున్న పోలింగ్‌కు అవసరమైన సమగ్ర ఎన్నికల సామాగ్రి సంబంధిత కేంద్రాలకు చేరుకుంది. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు తీవ్రతరం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు స్వయంగా పర్యటించి ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. పోలింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం 6 గంటలనుండే స్టేషన్లలో ఏర్పాట్లు పూర్తి చేయాలని, మాక్ పోలింగ్ నిర్వహించి ఖచ్చితంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని, ఓటర్ల సౌకర్యానికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేయడం జరిగిందన్నారు.

పోలింగ్ మెటీరియల్స్ పంపిణీ కూడా క్షేత్రస్థాయిలో సజావుగా ముగిసింది. పంచాయతీ శాఖ అధికారులు ఎన్నికల విధులను కట్టుదిట్టంగా, పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు.

**వేడెక్కిన పోరు ప్రశాంత ముగింపు?**

నిన్నటి వరకు ప్రచార హోరుతో మారుమ్రోగిన గ్రామాలు, పోలింగ్ ముందు విరామం దశలో ప్రశాంతంగా కన్పిస్తున్నాయి. అయితే, లోపల మాత్రం ఉత్కంఠ అలుము కున్నట్లు గ్రామస్తుల హావభావాలు తెలియజేస్తున్నాయి. పంచాయతీలో ఎవరు విజయం సాధిస్తారు, వచ్చే ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధి బాధ్యత ఎవరి భుజాలకు చేరుతుందన్నది ఈరోజు మధ్యాహ్నానికే నిర్ణయించబడనుంది.




## సిడ్నీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కృష్ణా జిల్లా–గన్నవరం: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, పెద్ద అవుటపల్లి గ్రామంలోని సిడ్నీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగాయి. లోకరక్షకుడైన యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల నక్షత్రాలు, క్రిస్మస్ చెట్లతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా క్రిస్మస్ విశిష్టతను చాటిచెప్పేలా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, యేసుక్రీస్తు జననాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిన క్రిస్మస్ స్కిట్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఎంతో శక్తితో, ఉత్సాహంతో తమ ప్రతిభను చాటుతూ మనసును కదిలించేలా ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రతినిధి మార్గ రైట్, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. “పిల్లలు ఎంతో అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చారని, వారిలోని సృజనాత్మకత మరియు భక్తి భావం ప్రశంసనీయమని” వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సిడ్నీ స్కూల్ ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కటింగ్ అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేయడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.



## సిపిఎం ఆధ్వర్యంలో ఉచిత ఐ క్యాంపు



గన్నవరం : మండలం లోని తెంపల్లి సిపిఎం కార్యాలయం లో శారా ఐ కేర్ విజయవాడ వారి సౌజన్యంతో సిపిఎం తెంపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఐ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు లో డాక్టర్ ఎ బాలాజీ 55 మందికి కంటి చికిత్స లు నిర్వహించి ఐ డ్రాప్ లు మందులు పంపిణీ చేశారు. 15 మంది కి కళ్ళ జోళ్ళు సిపార్స్ చేశారు, మరో 10 మందికి శుక్లాలు తొలగించడం కోసం కంటికి శస్త్ర చికిత్స లు అవసరం అని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ పార్టీ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ గొంగటి వీర్రాజు, కె వీర గంగాధర రావు, జి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గలగుట్టలో గజ్జి మల్లయ్యకు పెరుగుతున్న ఆదరణతో పార్టీల్లో ఆందోళన

**బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జ్ నాగుల కిరణ్ బాబు**



రామకృష్ణాపూర్ డిసెంబర్ (13 వాయిస్ టుడే)బీ బొగ్గలగుట్ట గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి గజ్జి మల్లయ్యకు లభిస్తున్న జనాదరణను చూసి అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఆందోళ నలకు గురవు తున్నారని, బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జ్ నాగుల కిరణ్ బాబు, జిల్లా అధ్యక్షుడు ములకల రాజేంద్రప్రసాద్ అన్నారు. స్వతంత్ర అభ్యర్థి గజ్జి మల్లయ్యకు బహుజన్ సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. గతంలో పెత్తందారుల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడిగా గుర్తింపు పొందిన గజ్జి మల్లయ్య, తన గత పాలనలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని తెలిపారు.రాక్షస పాలనకు ముగింపు పలికి రాముని పాలన కావాలనే నినాదంతో గ్రామ ప్రజలు గజ్జి మల్లయ్యకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రానున్నది బహుజన రాజ్యమని, రాజ్యాధికారంతోనే అన్ని సాధ్యమవుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో బొగ్గలగుట్ట గ్రామ ప్రజలు కత్తెర గుర్తుకు ఓటు వేసి గజ్జి మల్లయ్యను గెలిపించాలని వారు కోరారు.

# చిగురుమామిడి మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు

**17 గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు – స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారుల పిలుపు**

చిగురుమామిడి, డిసెంబర్ 13 (వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14 (ఆదివారం) జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీవో విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు.

మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా, 3 జోన్లు, 6 రూట్లు, 174 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో 174 మంది పీవోలు, 35 మంది పీవో రిజర్వ్‌లు, 262 మంది ఓపీఓలు, 55 మంది ఓపీఓ రిజర్వ్‌లు, 20 మంది ఆర్వోలు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు అధికారులు వివరించారు. ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సిబ్బందికి పంపిణీ చేసి, వారు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

కొంతమంది ఎన్నికల విధులకు హాజరు కాకపోవడంతో



కొన్ని బూత్‌లలో సిబ్బంది కొరత ఏర్పడినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అధికారులు తెలిపారు.

ఈ నెల 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుండగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో ర్యాలీలకు అనుమతి లేదని కూడా తెలిపారు.

మండలంలోని 17 గ్రామాల్లో సర్పంచ్ పదవులకు 75 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, 13 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం ఓటర్లు 34,370 మంది ఉండగా, ఇందులో పురుషులు 16,846 మంది, మహిళలు 17,523 మంది ఉన్నారు. ఎన్నికల విధుల్లో మొత్తం 491 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిగురుమామిడి ఎస్సై సాయి కృష్ణ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లో పోలీసు బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు.



## హైకోర్టు జడ్జి చేతులమీదుగా సామాజిక సేవ పురస్కార అవార్డు అందుకున్న పాలకుర్తి విజయ్ కుమార్

వరంగల్ ( వాయిస్ టుడే ) డిసెంబర్ 13 : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమనికి హైకోర్టు జడ్జి న్యాయమూర్తి నిమ్మ నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ మెంబర్ మరియు మహాత్మ జ్యోతిరావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత అంతర్జాతీయ మదర్ తెరిసా అవార్డు గ్రహీత పాలకుర్తి విజయ్ కుమార్ ను అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవన్ని పురస్కరించుకొని హైకోర్టు న్యాయమూర్తి నిమ్మ నారాయణ చేతుల మీదుగా పాలకుర్తి విజయ్ కుమార్ ను శాలువాతో సత్కరించి సిల్వర్ మెడల్ సామాజిక సేవ పురస్కారం అవార్డు అందజేశారు. ఒగత 20 సంవత్సరాల నుండి భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంలో మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచన విధానంలో ప్రయాణిస్తూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద ప్రజలకు న్యాయం చేస్తూ మహిళలపై దాడులు అత్యాచారాలు మైనర్ బాలికలపై అత్యాచారాలను ఖండిస్తూ వరంగల్ జిల్లాలో జిల్లా కలెక్టర్ దృష్టికి మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ దృష్టికి పోలీసు అధికారుల దృష్టికి వినతి పత్రం ద్వారా అవినీతి అక్రమాల గురించి అధికార దృష్టికి తీసుకుపోవడం మరియు పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా పోరాటం చేయడం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలపై దాడులు అత్యాచారాలను అరికట్టడం పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్నందుకు ఈ యొక్క సామాజిక సేవా పురస్కారం అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి నిమ్మ నారాయణ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు దౌర్జన్యాలు దాడులు అత్యాచారాలు అరికట్టకు అన్యాయాలపై ధైర్యంగా మాట్లాడి పేద ప్రజలకు న్యాయం చేసే బాధ్యతను ఇంకా కొనసాగించాలని పాలకుర్తి విజయ్ కుమార్ ను హైకోర్టు జడ్జి నిమ్మ నారాయణ అభినందించారు. ఈ అవార్డు అందుకున్న పాలకుర్తి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తుచేస్తుంది హైకోర్టు జడ్జి న్యాయమూర్తి నిమ్మ నారాయణ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ పేద ప్రజల హక్కుల కోసం నేను ఇంకా బలంగా పోరాడుతానని పాలకుర్తి విజయ్ కుమార్ తెలిపారు.

## గ్రామాభివృద్ధి చేయడమే నాలక్ష్యం

**గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా**

**పొట్లపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కళ్లేపల్లి వేంకట స్వామి**



హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామ సర్పంచ్ గా కాంగ్రెస్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతొ సర్పంచ్ అభ్యర్థిగా కళ్లేపల్లి వెంకటస్వామి పోటీలో ఉన్నారు.ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ పొట్లపల్లి నావాబుపేట బిడ్జి,రైతులకు మార్కెట్ యార్డ్ భూసేకరకణ,జిల్లాలోనే పేరుగాంచిన పొట్లపల్లి శ్రీ స్వయం భూ రాజ రాజేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి,గ్రామములో డ్రైనేజిలు, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానన్నారు.గతములో ఎంపీటీసీగా ఉన్నప్పుడు 2006లో ఇరవై నాలుగు గంటల రావడానికి కృషి చేస్తానన్నారు.అత్యధికముగా నిధులు తీసుకువచ్చానన్నారు. దేవేంద్రనగర్ ప్రజల కోసం ప్రత్యేకంగా అక్కడే రేషన్ బియ్యం పంపిణి జరిగేలా చేస్తానన్నారు.గ్రామంలో దేవాలయాలు అభివృద్ధి చేస్తానని, అర్హులకు రేషన్ కార్డులు, పెన్షండ్లు, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానన్నారు.పొట్లపల్లి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ మాడల్ గ్రామంగా అభివృద్ధి చేస్తానన్నారు.ప్రతి ఒక్కరికి అదుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు.అత్యధిక మెజారిటీతొ గెలిపించాలని ప్రజలను కోరారు.



## జిల్లెల గడ్డ గ్రామసర్పంచ్ అభ్యర్థిగా లావుడ్య రవీందర్

**నిస్వార్థ సేవ నిజాయితీకి మారుపేరు లావుడ్య రవీందర్**

**అభివృద్ధి సమాజ సేవ ఉన్నత విద్యావంతుడు నిత్యం ప్రజలతో మమేకం**

హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా లావుడ్య రవీందర్ పోటీ చేయుచున్నారు .ఉన్నత విద్యావంతుడు సమాజ అభివృద్ధి లక్ష్యంగా సమసమాజ స్థాపన ధ్యేయంగా అడుగులు వేస్తున్నాడు గతంలో గ్రామానికి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు గ్రామ పెద్దల ఆశీస్సులు నిండుగా ఉన్నాయి ప్రజలతో అనుబంధం ఉంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు ఈ సందర్భంగా లావుడ్యరవీందర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి విశేషమైన కృషి సిసి రోడ్ల నిర్మాణం ఇందిరమ్మ ఇండ్లు అనేక వంటి సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా చేయడంలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారుఅంతేకాకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లడానికి కృషి చేస్తానని చెబుతున్నాడు అంతేకాకుండా గ్రామంలో ఉన్న సమస్యలను అధికారులతో చర్చించి మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతానని జిల్లాల గడ్డ గ్రామాన్ని సిద్దిపేటజిల్లాలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని గ్రామానికి అధిక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని గ్రామ ప్రజల యొక్క నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అభివృద్ధి అంటే ఏమిటో చూపెడతానని ఈ సందర్భంగా తెలియజేశారు సర్పంచ్ అభ్యర్థిగా గా గెలిపిస్తే ప్రజలకు అభివృద్ధి చేసి చూపించి పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటారని తెలుపడం జరిగింది. అంతేకాకుండా విద్య వైద్యం వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తానని మరియు జాతీయ అవార్డులు సాధించేవరకు పోరాటం చేస్తానని తెలియజేయడం జరిగింది అంతేకాకుండా కేంద్ర నిధులు రాష్ట్ర నిధులు దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేస్తా అని తెలియజేశారు.

# రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు**

**కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 13బీ జిల్లాలో రేపు ఆదివారం నిర్వహించనున్న రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఏడు మండలాల్లో 156 గ్రామపంచాయతీలకు సర్పంచ్ పదవులు, 1,392 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికల ప్రక్రియలో భాగంగా 16 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని తెలిపారు. పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలో నామినేషన్లు దాఖలు కాకపోవడంతో పాటు, చాప్రాలపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి కోర్టు కేసు పెండింగ్‌లో ఉండటంతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదని కలెక్టర్ వివరించారు. దీంతో మిగిలిన 138 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. అలాగే మొత్తం వార్డుల్లో 248 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని పేర్కొన్నారు. పాండురంగపురం గ్రామపంచాయతీ పరిధిలో 8 వార్డులు, చాప్రాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 8 వార్డులు, పాల్వంచ మండలం సంఘం గ్రామపంచాయతీ పరిధిలో 4వ, 8వ వార్డులు, పాల్వంచ మండలం సోములగూడెం గ్రామపంచాయతీ పరిధిలో 1వ, 3వ వార్డులు, అశ్వరావుపేట మండలం కేసప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డుకు నామినేషన్లు దాఖలు కాకపోవడంతో, మిగిలిన 1,123 వార్డులకు రేపు ఆదివారం ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పోలింగ్




నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజున ఫలితాలు ప్రకటించేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకోసం లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

రెండవ విడత ఎన్నికలు అన్నపురెడ్డిపల్లి, అశ్వరావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ములకపల్లి, పాల్వంచ మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విడతలో మొత్తం 1,392 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,11,892 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, సీల్స్, ఓటర్ల జాబితాలు, ఫారాలు తదితర అన్ని ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే తరలించడం జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరుకుని విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులకు ముందుగానే శిక్షణ అందించామని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భద్రతా పరంగా జిల్లా పోలీస్ శాఖతో సమన్వయం చేసి సున్నితమైన, అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చెక్‌పోస్టులు, మొబైల్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ నగదు, మద్యం రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కీలక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది అందరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ సహకరించాలని కోరారు. జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.




## 20న జరుగు ఐ.ఎల్.పీ.ఏ రాష్ట్ర సదస్సును జయప్రదం చెయండి

**ఐ.ఎల్.పీ.ఏ జిల్లా కన్వీనర్ జే. గోపికృష్ణ**

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 13: ఈనెల 20వ తేదీన కొత్తగూడెం క్లబ్ లో జరుగు ఇండియాన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఐ.ఎల్.పీ.ఏ రాష్ట్ర ఐదవ సదస్సును జయప్రదం చేయాలని ఐ.ఎల్.పీ.ఏ జిల్లా కన్వీనర్ జే గోపికృష్ణ కోరారు. శనివారం జిల్లా కోర్టు లైబ్రరీ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇదిగో మీ భావాన్ని నిలుపుతూ,భాషా-వ్యాకరణ దోషాలు సరిచేసి పెద్దగా,ప్రభావవంతంగా మళ్లీ రచించి ఇస్తున్నానాని అంబేద్కర్ ఇచ్చిన పిలుపులో భాగంగా బ్లాక్ కోట్స్ ఫర్ బ్లా రెవల్యూషన్ న్యాయవాదుల హక్కులు,సమస్యలు,భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని,న్యాయవాదులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన,సామాజిక,ఆర్థిక సమస్యలపై నిరంతర పోరాటం చేయడమే కాకుండా,ప్రత్యేకంగా అట్టడుగు వర్గాల న్యాయవాదులను విద్య ద్వారా మాత్రమే విముక్తి చేయాలనే లక్ష్యంతో 365 రోజులు ఆన్లైన్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని జూనియర్ సివిల్ జడ్జ్ (జె సి జె),అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఏపీపీ) తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న న్యాయవాదులకు నిరంతరంగా అందిస్తున్న ఏకైక న్యాయవాద సంస్థ ఐ.ఎల్.పీ.ఏ నిలుస్తోందని. మహాత్మా జ్యోతిబా ఫూలే,బాబాసాహెబ్ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ భావజాలాన్ని ఆధారంగా చేసుకొని, సమానత్వం, న్యాయం, సామాజిక చైతన్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని న్యాయవాదుల మధ్య అవగాహన పెంచుతూ,వృత్తిలో వెనుకబడిన వర్గాలకు దిశానిర్దేశం చేసే ఈ రాష్ట్ర మహాసభను అందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎల్.పీ.ఏ సభ్యులు భానుప్రియ,యెర్రా కామేష్,సాధిక్ పాషా,అంబటి రమేష్,మారపాక రమేష్, వడ్లకుండ హరి పాల్గొన్నారు



## జక్లేర్ సర్పంచ్ ఎన్నికల్లో శివాని రెడ్డి జోరుగా ప్రచారం

మక్తల్ డిసెంబర్ 13 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ మండలం జక్లేర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శివాని రెడ్డి సుబ్బమ్మగారి.. ప్రచారం జోరుగా సాగుతోంది. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. సర్పంచ్ గా గెలిపిస్తే ప్రధాన సమస్యలను పరిష్కరించి గ్రామస్తులందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇస్తున్నారు. 17వ తేదీన జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వేడుకుంటున్నారు. ప్రచారంలో శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీ నరసింహ, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, ఓం ప్రకాష్, చంద్రకాంత్, అనసూయమ్మ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## సారం పల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 13: రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యం లో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా తంగళ్ళపల్లి మండలం లోని సారం పల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు చేసిన ఏర్పాట్లను సందర్శించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఎందరు ఓటర్లు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు కోసం సిద్ధం చేసిన వీల్ చైర్, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. ఓటింగ్, పూర్తి అయిన తర్వాత చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సీపీఓ శ్రీనివాసాచారి, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీఓ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 13: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న విఐపి రోడ్డు,చెరువు ప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం తొలగించే పనులను ఆలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో చేపట్టారు. రాబోయే రోజుల్లో సమ్మక్క సారక్క అమ్మ వార్ల జాతరకు ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. చెరువు పరిసరాలు, రోడ్లు, ఆలయ ప్రాంగణం శుభ్రంగా ఉంచుతూ సానిటేషన్ మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నారు. భక్తులు సౌకర్యంగా, శుభ్రమైన వాతావరణంలో దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు.



## గుడిగండ్ల సర్పంచ్ ఎన్నికల్లో ఈడిగి శ్రీనివాస్ గౌడ్ జోరుగా ప్రచారం

మక్తల్ డిసెంబర్ 13 వాయిస్ టుడే ప్రతినిధిబీ మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈడిగి శ్రీనివాస్ గౌడ్.. ప్రచారం జోరుగా సాగుతోంది. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ టీవీ రిమోట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. సర్పంచ్ గా గెలిపిస్తే ప్రధాన సమస్యలను పరిష్కరించి గ్రామస్తులందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇస్తున్నారు. 17వ తేదీన జరిగే సర్పంచ్ ఎన్నికల్లో టీవీ రిమోట్ గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వేడుకుంటున్నారు. ప్రచారంలో సీపీ తిరుపతయ్య, రాజు, అనిల్, ఖాజా, భరత్, రమేష్, విజయ్, శశి, పరమేశ్, తిమ్మారెడ్డి, రఘు రెడ్డి, ఎం వెంకటేష్, అరవింద్, భాస్కర్, రాము, నర్సింహ, కిష్టప్ప, సుదర్శన్ రెడ్డి , మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సైన్స్ పోటీల్లో జాతీయ స్థాయి



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 13 : అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో దమ్మన్నపేట్ జెడ్‌పీహెచ్‌ఎస్ విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించి పలు నగదు బహుమతులు గెలుచుకున్నారని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బోయన్నగారి నారాయణ తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 512 జట్లు పాల్గొనగా, వాటిలో అత్యుత్తమమైన 44 ఆవిష్కరణలను రెండో దశకు ఎంపిక చేశారు. ఈ 44 జట్ల లో దమ్మన్నపేట్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన 4 ఆవిష్కరణలు ఉండటం విశేషం.రెండో దశ పోటీల్లో 8వ తరగతి విద్యార్థినులు పొన్నాల నిహారిక, అన్నం రుతిక లు, గైడ్ టీచర్ సంపత్ కుమార్ మార్గదర్శనం లో రూపొందించిన “జంతు మృతదేహాలను తొలగించే ట్రాలీ” ఆవిష్కరణకు మొదటి బహుమతి లభించింది. వీరు రూ. 4,000/- నగదు బహుమతితో పాటు జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. వచ్చే నెల చివరి వారం లో బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో తమ ఆవిష్కరణను ప్రదర్శించనున్నారు. ఇదే పోటీల్లో 7వ తరగతి విద్యార్థులు పి. సాయి కుమార్, పి. అభిరామ్ లు రూపొందించిన “మహిళ వంట మిత్ర” ఆవిష్కరణకు మొదటి ప్రోత్సాహక బహుమతి (కన్సలేషన్ ప్రైజ్) లభించి రూ. 2,500/- నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన గైడ్ టీచర్‌ను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు హృదయపూర్వకంగా అభినందించారు.

## ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 13 : రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్ఈసీ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయా గ్రామాలకు కేటాయించిన వాహనాల్లో అధికారులు, సిబ్బంది సామగ్రితో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసాచారి, డీపీఓ షరీ ఫుద్దిన్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా పాల్గొన్నారు.



## నాగార్జునసాగర్ టు శ్రీశైలం లాంచీ యాత్ర

**మూడోసారి పర్యాటకులతో బయలుదేరి రాంచి**

నాగార్జునసాగర్ డిసెంబర్ 13 వాయిస్ టుడే ప్రతినిధి: నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం లాంచీ ప్రయాణం శనివారం మూడోసారి లాంచీ శ్రీశైలానికి బయలుదేరింది,లాంచీ యూనిట్ మేనేజర్ తెలిపిన వివరాల ప్రకారం నాగార్జునసాగర్ నుంచి పర్యాటకులతో శ్రీశైలానికి రెండవసారి లాంచి యాత్ర కృష్ణా నదిపై అద్భుత అందాల ఎత్తయిన కొండల మధ్యలో నుంచి ఈ ప్రయాణం కొనసాగిందని అన్నారు,ఈ ఏడాదిలో ఈ లాంచి రెండవసారి ప్రయాణం కొనసాగిందని అన్నారు, ప్రయాణికులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కృష్ణానది పరవళ్లు,చుట్టూ ఎత్తైన కొండలు, పచ్చని నల్లమల అటవీ అందాల నడుమ సాగే ఈ ప్రయాణం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇస్తోంది.సాగర్ జలాశయం నుండి శ్రీశైలం వరకు దాదాపు 5-6 గంటల పాటు సాగే ఈ జల విహారంలో ప్రయాణికులు ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు.రోడ్డు మార్గం కంటే చల్లని గాలిని ఆస్వాదిస్తూ,నీటి అలలపై ప్రయాణిస్తూ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు వెళు ండటంతో భక్తులు, పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం రెండవ విడతగా లాంచీ బయలుదేరడం పర్యాటక శాఖకు ఉన్న డిమాండ్ ను తెలియజేస్తోంది. అధికారులు పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా లైఫ్ జాకెట్లు,ఇతర భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.ప్రయాణ మధ్యలో కనిపించే ప్రకృతి రమణీయ దృశ్యాలు,నీటిపై విహరిస్తూ ఫోటోలు దిగడానికి పర్యాటకులు ఆసక్తి చూపారు.ఈ సీజన్ లో లాంచీ ప్రయాణానికి మంచి ఆదరణ లభిస్తోంది.

# శ్రీలంక టోర్నీలో గోల్డ్ మెడల్ సాధించిన దివ్యాంగ క్రీడాకారిని "అర్చన"

**ఒలంపిక్ క్రీడలకు ఎదగాలన్న తపనతో సాగుతున్నా.. అర్చన.**

**సిరిసిల్లకు చేరుకున్న అర్చనను సత్కరించిన వెల్ఫేర్ సొసైటీ.**



వాయిస్ టుడే న్యూస్‌బీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 13 : ఒలంపిక్ క్రీడల్లో అవకాశం దక్కించు కోవాలన్న తపనతో ముందుకు సాగుతున్నానని అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన దివ్యాంగుల వాలీబాల్ క్రీడాకారిణి మిట్టపల్లి అర్చన ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీలంకలో ఈనెల 6, 7 తేదీలలో జరిగిన "ఫస్ట్ సౌత్ ఆసియన్ పారా త్రో బాల్ ఛాంపియన్షిప్ మెన్ అండ్ ఉమెన్" టోర్నీలో పాల్గొని గోల్డ్ మెడల్ తో శనివారం సిరిసిల్లకు చేరిన అర్చనను సిరిసిల్ల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం సిరిసిల్ల స్త్రీ శిశు సంక్షేమ వయోవృద్ధుల దివ్యాంగుల శాఖలో "మల్టీ టాస్క్" విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగంతో విధులు నిర్వహిస్తున్న అర్చన పారా గేమ్స్ లో గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ఎంపికై జాతీయస్థాయికి ఎదిగారు. అక్కడినుండి అంతర్జాతీయ సాయి క్రీడల్లో అవకాశం దక్కించుకున్నారు. అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన అర్చనను తమ శాఖ ఆధ్వర్యంలో శ్రీలంక లో జరిగిన ఛాంపియన్ షిప్ పోటీలకు ప్రభుత్వం పంపింది. పేదరికంలో ఉండి ఎం ఎ సోషియాలజీ, బీ ఈడి చదివిన అర్చన తన ఇద్దరు పిల్లలతో సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట గ్రామంలో నివసిస్తున్నారు. 5వ తరగతి చదువుతున్న కూతురు రూపశ్రీ,4వ తరగతి చదువుతున్న కుమారుడు రాణా ప్రతాప్ లను చదివించుకుంటూనే ఇటు కుటుంబ పోషణ అటు ఉద్యోగంలో విధులు నిర్వహిస్తూ క్రీడల పట్ల మక్కువతో కేవలం "ధైర్యం" అనే సాధనంతో ముందుకు సాగుతున్నారు. ఏడుగురు క్రీడాకారుల జట్టుతో శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని "డిప్లమా ఆఫ్ అచీవ్మెంట్" అవార్డుతో బంగారు పతకం సాధించారు. తన కోచ్ సాయి అందించిన మెలుకువలతో విజయం సాధించడం సులువు అయినట్టు అర్చన పేర్కొన్నారు. స్పాన్సర్స్ దొరికితే ఒలంపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు కృషి చేస్తానన్నారు. స్పాన్సర్స్ ఉంటే క్రీడల్లో మరింతగా రాణించడానికి అవకాశం కలుగుతుందన్నారు. జీవితంలో కష్టాలను ఎదుర్కొంటూనే విధి నిర్వహణలో రాణిస్తున్న అర్చన క్రీడల్లో మరింత స్థాయికి ఎదిగి విజయాలను సొంతం చేసుకోవాలని సిరిసిల్ల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది శాంతి ప్రకాష్ శుక్ల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శాంతి ప్రకాష్ శుక్ల, రాధాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు, విశ్రాంత ఉపన్యాసకులు ఝాన్సీ శుక్ల, ఎల్లే సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటెయ్యకపోతే నా డబ్బులు తిరిగివ్వండి ప్లీజ్



నార్కట్‌పల్లి: పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన ఓ సర్పంచి అభ్యర్థి.. ఓటర్లకు పంచిన డబ్బులను తిరిగి వసూలు చేశాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఔరవానిలో చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి మద్దతుతో సర్పంచి అభ్యర్థిగా పోటీ చేసిన కల్లూరి బాలరాజు.. ఓటర్లకు డబ్బులు పంచాడు. కానీ.. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జక్కల పరమేశ్ 450 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు.

దీంతో బాలరాజు దేవుడి ఫొటో పట్టుకొని "మీరు నాకు ఓటు వేస్తే దేవుడి మీద ప్రమాణం చేసి చెప్పండి. లేదంటే నేను మీకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వండి" అని విలపిస్తూ గ్రామంలో ఇంటింటికీ తిరిగాడు. చాలా మంది నుంచి డబ్బులు వసూలు చేశాడు. ఈ సందర్భంగా ఆయన భార్య మాట్లాడుతూ.. 50 లేదా 60 ఓట్ల తేడాతో ఓడిపోతే డబ్బులు అడగకపోయేవాళ్లమన్నారు. 450 ఓట్లతో ఓడిపోయినందుకు తిరిగి అడుగుతున్నామని ఓటర్లకు తెలియజేశారు

## కుటుంబాన్ని కబళించిన రోడ్డు ప్రమాదం



పెద్దశంకరంపేట, నిజాంసాగర్: పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు సొంతూరుకు వెళ్తున్నామన్న సంతోషంతో బయల్దేరిన ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం కబళించింది. ఓటోత్సాహంలో ఉన్న బాధిత కుటుంబం, బంధువుల్లో ఈ ఘటన తీరని విషాదాన్ని నింపింది. అల్లాదుర్గం ఎస్సై శంకర్, పెద్దశంకరంపేట ఏఎస్‌ఐ సంగమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి గ్రామానికి చెందిన కుర్మ లింగమయ్య, సాయమ్మ దంపతులకు కుమారుడు సాయి, కుమార్తె మానస ఉన్నారు. లింగమయ్య సొంతూరిలో సరైన ఉపాధి దొరక్క ఏడేళ్ల కిందట హైదరాబాద్ లింగంపల్లికి కుటుంబంతో సహా వలస వెళ్లాడు. లింగమయ్య అక్కడి ఎల్‌ఐజీ కాలనీ వైకుంఠధామంలో కాపలాదారుగా చేరి కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. పిల్లలను చదివించుకుంటూ అక్కడే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు.

**ఓటేద్దామని సొంతూరికి ఎన్నో ఆశలతో వస్తూ..**

మాగి గ్రామంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆదివారం ఓటేద్దామని శనివారం సాయంత్రం లింగంపల్లి నుంచి ఒకే బైక్‌పై కుటుంబమంతా కలిసి బయలుదేరారు. మార్గం మధ్యలో పెద్దశంకరంపేట మండలం రాఘవాని తండా వద్ద వద్ల ట్రాక్టర్‌ను ఢీకొట్టి కింద పడిపోగా.. నలుగురూ అక్కడికక్కడే మృత్యువాతపడటం బంధువులను శోకసంద్రంలో ముంచేసింది. ఓటేయకుండానే తీరనిలోకాలకు వెళ్లడం గ్రామస్థులను కలచివేసింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

# రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు 700 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు

**పోలింగ్,కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి**



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 13 : ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎన్నికల విధులకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండవ విడత ఎన్నికల నిర్వహణకు రూట్ మొబైల్స్ : 26 జోనల్ టీమ్స్ : 07 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), క్విక్ రియాక్షన్ టీమ్స్ : 03, స్ట్రయికింగ్ ఫోర్స్ : 02 ఏర్పాటు చేసి మొత్తం 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ సమయంలో, కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని సూచించారు. రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద లేదా రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికల నియమావళిని ప్రజలు పాటిస్తూ, పోలీసులకు సహకరించి స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 9 కేసులు నమోదు, రూ. 23,28,500/- నగదు సీజ్, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వహించిన దాడుల్లో 93 కేసుల్లో 1387 లీటర్ల మద్యం సీజ్, అలాగే 224 కేసుల్లో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే, ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య,సి.ఐ లు, ఎస్.ఐ సిబ్బంది ఉన్నారు.



## భోజనాలు చాలక సిబ్బంది ఆందోళన

కూసుమంచి: కూసుమంచి మండలంలో సుమారు 1,200 మంది సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. కూసుమంచిలో పోలింగ్ సామగ్రి తీసుకెళ్లేందుకు వచ్చిన సిబ్బందిలో కొందరికి మధ్యాహ్న భోజనం అందకపోవడంతో ఆందోళన చేశారు. ఖాళీ పేట్లు చేతబట్టి నినదించారు. గంట వ్యవధిలో సమకూర్చటంతో భోజనం ముగించి విధులు కేటాయించిన గ్రామాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో కేంద్రాన్ని సందర్శించేందుకు వచ్చిన కలెక్టర్ అనుదీప్ అధికారులను మందలించారు. సకాలంలో భోజనం ఏర్పాటుచేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. నేలకొండపల్లి పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలోనూ ఇదే పరిస్థితి ఉత్పన్నమైంది.

## భర్త సమయం ఇవ్వడం లేదని మనస్తాపం..



మూసాపేట: కొత్తగా పెళ్లయిన తనకు సమయం ఇవ్వకుండా ఎక్కువ సమయం ఉద్యోగానికి కేటాయిస్తున్నాడని మనస్తాపం చెందిన ఓ గృహిణి బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి బంధువులు, కూకట్‌పల్లి ఎస్సై గిరీష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చందనాజ్యోతి (25)కి కొత్తగూడెం నివాసి బి.వెంకటసాయి యశ్వంత్‌తో ఈఏడాది ఆగస్టు 14న వివాహం జరిగింది. ప్రస్తుతం వీరిద్దరూ మూసాపేట పరిధి ఆంజనేయనగర్‌లో మూడు నెలలుగా నివాసం ఉంటున్నారు. చందనాజ్యోతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా.. 'వర్క్‌ఫ్రం హోం' చేస్తున్నారు. యశ్వంత్ స్థానికంగా ఉన్న మెడ్‌ప్లస్ సంస్థలో పనిచేస్తున్నారు. చందనాజ్యోతి భర్త ఉదయం వెళ్లి రాత్రికి కానీ తిరిగిరాడు. అసలే కొత్తగా పెళ్లవడం.. ఇంట్లోనే ఉంటుండటంతో ఆమె మానసిక వేదనకు లోనైనట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై భర్తతో రెండు మూడురోజులుగా ఆమె గొడవపడుతున్నారు. శుక్రవారం రాత్రి భోజనం చేశాక దంపతులు చెరోగదిలో నిద్రపోయారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చందనాజ్యోతి నిద్రిస్తున్న గది తలుపులు తెరవాలని ఎంత పిలిచినా ఆమె తెరవలేదు. ఆ గది తలుపులు పగలకొట్టి చూడగా.. అప్పటికే బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించింది. కూకట్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి సోదరుడు చంద్రకిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యపై బండరాయితో భర్త దాడి

రఘునాథపాలెం: వసతి గృహంలో చదువుతున్న కొడుకును చూసేందుకు వచ్చిన మహిళపై ఆమె భర్త బండరాయితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఖమ్మం నగర శివారు పుట్టకోటలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గురవాయిగూడెం గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు, కుమారి భార్యాభర్తలు. వీరి కుమారుడు పుట్టకోటలోని బొమ్మ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆరు నెలలుగా విడిగా ఉంటున్నారు. రెండో శనివారం కావడంతో కుమారుడిని చూసేందుకు వసతి గృహం వద్ద ఒకరికి తెలియకుండా మరొకరు వచ్చారు. ఈ సందర్భంగా కుమారుడికి అన్నం తినిపించిన తర్వాత కొద్ది సేపటికి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన పూర్ణచంద్రరావు విచక్షణరహితంగా రాయితో కుమారిపై దాడి చేశాడు. అక్కడే ఉన్న తోటి విద్యార్థుల తల్లిదండ్రులు పూర్ణచంద్రరావును బంధించి పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని 108లో సర్వజనాసుపత్రికి తరలించారు. కుమారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపటంతో బంధువులు హైదరాబాద్ తరలించారు. ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టినట్టు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు.



## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్

మాడుగులపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికలను పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను సూచించారు. మాడుగులపల్లి డీఆర్సీ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల పూర్తి బాధ్యత స్టేజ్-2 ఆఫీసర్‌పై ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ం

## డ్రైనేజీలో బ్యాలెట్ పత్రాలు.. ఘటనపై విచారణకు ఎస్ఈసీ ఆదేశాలు



నల్గొండ: నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించిన బ్యాలెట్ పత్రాలు డ్రైనేజీలో కనిపించడం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. కత్తెర గుర్తుకు ఓటువేసి ఉన్న బ్యాలెట్ పత్రాలు మురుగు కాలువలో దర్శనమివ్వడం తీవ్ర గందరగోళానికి దారితీసింది. దీనిపై ఎన్నికల అధికారి, పోలీసులకు భారత రాష్ట్ర సమితి నేతలు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల సామగ్రి భద్రపరచడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై విచారణకు రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) ఆదేశించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఆదేశాలు జారీ చేసింది. ఘటనకు సంబంధించి స్టేజ్ -2 ఆర్వోపై కలెక్టర్ ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేశారు